
సాక్షి
మెదక్
బుధవారం । 26 । మార్చి । 2025



మడిమడికో రకం
ఎకరం భూమిలో 20 రకాల పంటలను సాగు చేస్తున్న రైతు వెంకటరావు.
వివరాలు 8లో ▸



రెండవ పంటలో..
రెండవ పంటలో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు.
వివరాలు 8లో ▸



న్యూస్‌రీల్

వ్యవసాయ రంగానికి పెద్దపీట



మాట్లాడుతున్న డీసీసీబీ సీఈఓ శ్రీనివాస్

నర్సాపూర్: వ్యవసాయ రంగంతో పాటు దాని అనుబంధ రంగాలకు రుణాలు ఇవ్వడంలో పెద్ద పీట వేస్తున్నామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) సీఈఓ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం డీసీసీబీ శాఖలో రికవరీ, బ్యాంకు కార్యకలాపాలు పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 50 డీసీసీబీ శాఖల ద్వారా ఏడు వందల కోట్ల డిపాజిట్లు సేకరించామని, 18వందల కోట్ల రుణాలు అందజేశామని తెలిపారు. కాగా రుణాల రికవరీ 84శాతం వసూలు చేశారని చెప్పారు. రైతులకు వ్యవసాయానికే కాకుండా తదితర రుణాలిస్తున్నామని వివరించారు. సమావేశంలో స్థానిక బ్రాంచ్ మేనేజర్ అభినవ్, ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణాకర్ రావు, ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్ పాల్గొన్నారు.

పాఠశాలకు సహాయం

థాయిలాండ్ ప్రతినిధుల హామీ



మాట్లాడుతున్న ప్రతినిధులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి ప్రాథమికోన్నత పాఠశాలను థాయిలాండ్‌కు చెందిన సింజెంటా సీడ్ కంపెనీ ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. తమ సంస్థ ద్వారా పాఠశాలకు అవసరమైన సహాయం అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి వారి ప్రతిభను పరిశీలించారు. పాఠశాలకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరగా, అంగీకరించినట్లు హెచ్‌ఎం నాగసుజాత తెలిపారు.

పశుపోషణపై అవగాహన

పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య

నర్సాపూర్‌రూరల్: పశు పోషణపై ప్రతి రైతుకు అవగాహన అవసరమని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటయ్య అన్నారు. మంగళవారం మండలంలోని నత్నాయిపల్లిలో నేషనల్ ఆగ్రో ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేతలో మినరల్ మిక్చర్, ఖనిజ మిశ్రమం, కాల్షియం వంటివి ఉండేలా చూసుకోవాలన్నారు. పశువులకు కావాల్సిన మందులు, పశుగ్రాసం విత్తనాలు నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ ఉచితంగా అందజేసింది. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ జనార్దన్, పశువైద్యాధికారులు సౌమిత్, ప్రియాంక, స్వప్న, నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ సభ్యులు గజేంద్రియన్, రాజకుమార్, రామకృష్ణ, వీరేశ్ పాల్గొన్నారు.

మార్కెట్ ప్రకారమే పరిహారం



మాట్లాడుతున్న ఆర్‌డీఓ మహిపాల్

నర్సాపూర్: సంగారెడ్డి కెనాల్‌లో భూములు కోల్పోతున్న రైతులు మార్కెట్ ప్రకారమే పరిహారం చెల్లించాలని ఆర్‌డీఓ మహిపాల్‌ను కోరారు. మంగళవారం శివ్వంపేట మండలంలోని చిన్నగొట్టిముక్కల గ్రామ రైతులతో అవార్డు సమావేశం స్థానిక రైతు వేదికలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆర్డీవో హాజరై మాట్లాడుతూ గ్రామం మీదుగా కెనాల్ వెళ్తుందని, కాల్వ కోసం ప్రభుత్వం భూమి సేకరిస్తున్నామని చెప్పారు. తమ భూములకు మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కొందరూ, కాల్వ నిర్మాణానికి తమ భూములు తీసుకోవద్దని మరి కొంతమంది రైతులు ఆయనను కోరారు. రైతుల అభ్యర్థనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఆర్‌డీఓ వివరించారు. సమావేశంలో తహసీల్దార్ కమలాద్రి, ఆర్‌ఐ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సీల్డ్ టెండర్ల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని 27 పీఎం శ్రీ ప్రభుత్వ పాఠశాలల్లో శానిటరీ ప్యాడ్స్ సరఫరా చేయడానికి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు సిద్దిపేట డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెండర్ ఫారం ధర రూ.2 వేలు, ఈఎండీ ధర రూ.50 వేలు ఉంటుందన్నారు. టెండర్ ఫారాలు ఈ నెల 28 వరకు విద్యాశాఖ కార్యాలయంలో పొందాలని, పూర్తి చేసిన ఫారాలను బాక్స్‌లో వేయాలన్నారు. సీల్డ్ టెండర్లను ఈ నెల 29న ఉదయం 11గంటలకు జేసీ కమిటీ ఆధ్వర్యంలో తెరుస్తామని తెలిపారు.

సన్నబియ్యం సన్నద్ధం

- ఒకటి నుంచి చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా 2.14 లక్షల కార్డులు
- ప్రతి నెల 4367.538 మెట్రిక్ టన్నులు



మెదక్‌జోన్: ఆహార భద్రత కార్డులున్న పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఏప్రిల్ ఒకటి నుంచి చౌకధరల దుకాణాల ద్వారా సరఫరా చేయనున్నారు. కాగా ఇప్పటి వరకు పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని 80శాతం మంది తినలేదు. కేవలం 20 శాతం మాత్రమే తిన్నారు. రేషన్ షాపుల ద్వారా ఉచితంగా తీసుకొని బయట అమ్ముకున్నారు. కానీ ఇక నుంచి పంపిణీ చేసే సన్న బియ్యాన్ని లబ్ధిదారులందరూ తిననున్నారు.

జిల్లాలో రెండు లక్షల పై చిలుకు రేషన్ కార్డులు

మెదక్ జిల్లాలో 2,14,155 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిలో ఆహార భద్రత కార్డులు 2,00,229, అంత్యోదయ కార్డులు 13,860, అన్నపూర్ణ కార్డులు 66 ఉండగా వీటికి నెలకు 4367.538 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 520 రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. కాగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సన్న బియ్యం పథకాన్ని సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఆ మరుసటి రోజు నుంచి చౌకధరల దుకాణం ద్వారా ఒక్కో వ్యక్తికి 6 కిలోల చొప్పున ఇవ్వనున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆయా ఎంఎల్‌ఎస్ పాయింట్లలో బియ్యం సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

వానాకాలంలో 1.5 లక్షల ఎకరాల్లో సాగు

ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 2.73 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా అందులో 1.5 లక్షల ఎకరాల్లో సన్నాలను సాగు చేశారు. ఇందుకు ప్రధాన కారణం ప్రభుత్వం క్వింటాల్‌కు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వడంతో ఎక్కువ మొత్తంలో సన్నాల సాగుకు రైతులు మొగ్గు చూపారు. కాగా ప్రత్యేకంగా జిల్లా వ్యాప్తంగా 93 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 53,660 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం సేకరించారు. సీఎంఆర్ కోసం పలు రైస్‌మిల్లర్లకు ధాన్యం ఇవ్వగా ఇప్పటి వరకు 80 శాతం బియ్యాన్ని మిల్లర్లు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మిగతా 20 శాతం 15 రోజుల్లో రానున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా గతంలో హుజురాబాద్ ఉప ఎన్నికల నేపథ్యంలో కొత్తవారు రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు వారం పాటు సమయం ఇవ్వగా జిల్లా వ్యాప్తంగా 2,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం 15 రోజుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తుండగా ఇప్పటి వరకు 4 వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయి. కానీ ఈ ప్రక్రియ ఎప్పటి వరకు పూర్తవుతుందో అధికారులు కచ్చితమైనా డేట్‌ను నిర్ణయించలేదు.

బయట విక్రయానికి బ్రేక్!

ఇప్పటి వరకు చౌకధరల దుకాణాల ద్వారా అందించిన దొడ్డు బియ్యాన్ని నిరుపేదలైన 20 శాతం జనాలు మాత్రమే తినగా 80 శాతం మంది జనాలు వాటిని విక్రయించారు. రేషన్ బియ్యం ఇచ్చారని తెలియగానే టాటా ఏసీ వాహనాల ద్వారా పలువురు వ్యాపారులు గ్రామాల్లో గద్దల్లా వాలిపోయి ఇండ్లు తిరుగుతూ కిలోకు రూ.15 చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేసేవారు. ఆ బియ్యాన్ని రైస్‌మిల్లర్స్ వారి దగ్గర కొనుగోలు చేసి వాటినే తిరిగి ప్రభుత్వానికి (ఎఫ్‌సీఐ)కి అప్పగించే వారు. ఇలా రొటీన్ పద్ధతిలో పీడీఎస్ రైస్ తిరిగేవి. ప్రస్తుతం సన్నబియ్యం పంపిణీ కాబోతుండటంతో వాటిని బయట విక్రయించకుండా ప్రతి కుటుంబం ఇక నుంచి సన్న బియ్యాన్ని తిననున్నారు.

సబ్సిడీ పై సాగు పరికరాలు

- నూతన పద్ధతులలో ప్రోత్సహించేందుకు..
- ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం, జనరల్ రైతులకు 40 శాతం రాయితీ
- 27వరకు దరఖాస్తుకు అవకాశం
- మండల కమిటీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక



టేక్మాల్‌లో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం రైతులకు అండగా నిలిచేందుకు సబ్సిడీపై పరికరాలను అందిస్తోంది. నూతన పద్ధతులతో వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు 2024–25 సంవత్సరానికి పరికరాలను అందించడానికి దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించారు. అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సబ్సిడీకి అర్హులు..

- పట్టా పాస్ పుస్తకం కలిగిన ఎస్సీ, ఎస్టీ, జనరల్ మహిళలు మాత్రమే అర్హులు
- ఎస్సీ, ఎస్టీ రైతులకు 50% రాయితీ, జనరల్ రైతులకు 40% రాయితీ
- లక్ష కన్నా ఎక్కువ లబ్ధి పొందే రైతు ఖచ్చితంగా ఒక ఎకరం భూమి కలిగి ఉండాలి

యంత్ర పరికరాలు ఇవే..

రైతులకు అందజేయనున్న పరికరాల్లో బ్యాటరీ స్ప్రేయర్‌లు జనరల్ 2, ఎస్సీలకు1, పవర్ స్ప్రేయర్ జనరల్‌కు 3, ఎస్సీలకు 1, రోటవేటర్ జనరల్ 1, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ జనరల్ 1, డిస్క్ హ్యారో జనరల్ 2, ఎస్టీలకు 1, ట్రాక్టర్ ఎస్సీలకు 1 ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఎంపిక విధానం ఇలా..

రైతులు దరఖాస్తు చేసుకున్న అనంతరం మండల స్థాయిలో నియమించిన కమిటీ సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. ఈ కమిటీకి కన్వీనర్‌గా మండల వ్యవసాయాధికారి, మెంబర్లుగా తహసీల్దార్, ఎంపీడీఓలు వ్యవహరిస్తారు.

దరఖాస్తుకు కావాల్సినవి..

ఈ నెల 27వ తేదీలోపు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్‌కు సంబంధించిన పరికరాలకు ఆర్సీ జిరాక్స్, పాస్ ఫొటో, బ్యాంక్ పాసు పుస్తకం కావాలి. భూమి సారానికి సంబంధించిన సాయిల్ హెల్త్ కార్డు తప్పనిసరి జతచేయాలి.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఈ నెల 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. రైతులు మరింత సమాచారం కోసం వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలి.
– రాంప్రసాద్, ఏఓ, టేక్మాల్

కూలీలందరికీ ఉపాధి: జెడ్పీ సీఈఓ

- పని చేసే చోట వసతులు కల్పించాలి
- తాగునీటి ఎద్దడికి ముందస్తు చర్యలు



కూలీలతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

రేగోడ్(మెదక్): ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలందరికీ పని కల్పిస్తామని మెదక్ జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. రేగోడ్ మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ గృహాన్ని పరిశీలించి, ఉపాధిహామీ కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధిహామీ ద్వారా అడిగిన వారందరికీ పని కల్పిస్తున్నామని, పని చేసిన వెంటనే కూలీ డబ్బులు చెల్లిస్తున్నామని తెలిపారు. కూలీలు పని చేస్తున్న ప్రాంతంలో వసతులు కల్పించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా మండలాల్లోని వార్డుల వారీగా సరఫరా సమస్యలను తెలుసుకొని ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ రంగాచారి, ఎంపీడీఓ సీతారావమ్మ, సూపరింటెండెంట్ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్
- కస్తూర్బా గాంధీ హాస్టల్ తనిఖీ



హాస్టల్ భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు సిబ్బంది పూర్తి స్థాయిలో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం శివ్వంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సిబ్బంది సమయ పాలన పాటిస్తూ, ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. అనంతరం గూడూరులోని కస్తూర్బా గాంధీ హాస్టల్‌ని కలెక్టర్ తనిఖీ చేశారు. వంటగది నిర్వహణ పరిశుభ్రంగా లేకపోవడంతో సిబ్బంది పై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో విద్యా సామర్థ్యాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. పది అనంతరం ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. 18 ఏండ్లు నిండకుండా మైనర్‌లకు పెండ్లి చేస్తే వారి తల్లిదండ్రులతో పాటు భాగస్వాములైన వారందరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అవంచలో ఎండిన వరి పైరు

నీళ్లు లేక నెర్రెలు బారి

- ఎండుతున్న వరి పంటలు
- బోరున విలపిస్తున్న రైతులు

నర్సాపూర్‌రూరల్: పంటలు ఎండుతుండటంతో రైతులు బోరున విలపిస్తున్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేస్తే చేతికందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అవంచ గ్రామానికి చెందిన చిగురు కృష్ణయ్య తనకున్న మూడెకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోరు బావితో వరికి నీరందించలేని పరిస్థితి నెలకొంది. రెండు లక్షలు ఖర్చు పెట్టి బోరు వేయించినా చుక్క నీరు పడలేదు. దీంతో పెట్టుబడితో పాటు బోరు అప్పులు మిగిలాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు సన్నకారు రైతులను ఆదుకోవాలని కోరాడు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు

డీపీఓ యాదయ్య

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ యాదయ్య అధికారులకు సూచించారు. మండలంలోని రుద్రారం, చందంపేట గ్రామాల్లో మంగళవారం డీపీఓ ఆకస్మికంగా పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులు, పల్లె ప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించారు. అనంతరం గ్రామ కార్యదర్శులు అనురాధ, పద్మలకు పలు సూచనలు చేశారు.



నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ

ఈ పాస్ మిషన్ల ద్వారా ఎరువులు

వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్



ఎరువుల షాపులో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): డీలర్లు ఈ పాస్ మిషన్ల ద్వారా ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కౌడిపల్లిలోని భాగ్యలక్ష్మి ట్రేడర్స్, మహమ్మద్‌నగర్‌లోని పీఏసీఎస్ ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసి స్టాక్, రిజిస్టర్, ధరల పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు అమ్మాలని సూచించారు. మోతాదుకు మించి ఎరువులు చల్లవద్దని డీలర్లు రైతులకు చెప్పాలన్నారు. సీజన్‌కు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పుణ్యవతి, ఏఓ స్వప్న, డీలర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం, పండ్లతోటలపై రైతులకు అవగాహన

నర్సాపూర్: రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు పలు అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక రైతు వేదికలో జిల్లా వ్యవసాయాధికారి విన్సెంట్ వినయ్‌కుమార్ పలువురు రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త బాలాజీనాయక్ వేసవిలో పశుగ్రాస యాజమాన్యం అంశంపై, అసిస్టెంట్ ప్రొఫెసర్ శంకర్ స్వామి పండ్లతోటల అంశంపై, ఇఫ్కో రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ కృపాశంకర్ మాట్లాడుతూ నానో ఎరువుల ప్రయోజనాలు, దిగుబడి పెంపు, నేల ఆరోగ్యం ప్రభావం అనే అంశాలపై వీడియో ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు దీపిక, రాజశేఖర్, ఏఈఓలు చంద్రవేణి, రవివర్మ, నిరోష, తేజస్విని, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనపురం ప్రాజెక్టుకు గ్రహణం

ఎత్తు పెంపు, లైనింగ్ కోసం ప్రతిపాదనలు

- ఎనిమిదేళ్లయినా విడుదల కాని నిధులు
- ఆగిన భూసేకరణ.. ముందుకెళ్లని పనులు
- రూ.43.64 కోట్లకు గాను సగం నిధులే విడుదల
- ఎత్తు పెరిగితే 10 వేల ఎకరాలకు ప్రయోజనం

పాపన్నపేట(మెదక్): మెతుకు సీమ రైతన్నలకు బతుకునిచ్చే ఘనపురం ప్రాజెక్టుకు గ్రహణం వీడటం లేదు. ఏళ్లు గడుస్తున్నా ఎత్తు పెంపు, లైనింగ్ పనులు పూర్తి కావడం లేదు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ఏరియల్ సర్వే నిర్వహించి, ఆనకట్ట ఎత్తు పెంపు కోసం మంజూరు చేసిన రూ.43.64 కోట్ల నిధులకు గాను రూ.23.50 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. దీంతో భూసేకరణ ఆగిపోయింది. ఎనిమిదేళ్లు గడిచినా పనులు ముందుకు సాగడం లేదు. ఎత్తు పెరిగితే నీటి నిల్వ సామర్థ్యం 0.3 టీఎంసీలకు చేరి మరో 10 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఫతే నహర్, మహబూబ్ నహర్ కెనాళ్ల లైనింగ్ కోసం 2022లో రూ.50.32 కోట్లు మంజూరయ్యాయి. కాని ఇంత వరకు 50 శాతం పనులే పూర్తయ్యాయి.

1905లో ప్రాజెక్టు నిర్మాణం

కరువు నేలలో సిరులు పండించాలన్న ఆశయంతో 1905లో నిజాం ప్రభువు నిర్మించిన ఘనపురం ప్రాజెక్టు 120 ఏళ్లు దాటినా మరమ్మతులకు నోచుకోవడం లేదు. మంజీరా నదిపై 0.3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 21,165 ఎకరాల సాగు లక్ష్యంతో ప్రాజెక్టును నిర్మించారు. ఆనకట్ట పొడవు 725 మీటర్లు కాగా ఇరు వైపులా ఫతేనహర్, మహబూబ్ నహర్ కాలువలు ఉన్నాయి. మట్టి పూడిక తీయకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం 0.135కు పడిపోయింది. దీంతో సింగూరు నుంచి నీరు విడుదల చేసినప్పుడల్లా .. నీరు వృథా అవుతోంది.

ఎత్తు పెంపునకు, లైనింగ్‌కు నిధులు మంజూరు

2014లో హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆనకట్ట ఎత్తు పెంపు కోసం రూ.43.64 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం 462.775 మీటర్ల ఎత్తు ఉన్న ఆనకట్టను 1.725 మీటర్లు పెంచాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఎత్తు పెంపు వల్ల కొల్చారం మండలంలోని చిన్న ఘనపూర్, పాపన్నపేట మండలంలోని నాగ్సాన్‌పల్లి, కొడుపాక, చిత్రియాల్ గ్రామాలకు చెందిన 191.14 ఎకరాల భూమి నీట మునుగుతోంది. వీరికి రూ.13.10 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉండగా, ఇందులో రూ.5 కోట్లు రైతులకు చెల్లించారు. మరో రూ.8.10 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఎత్తు పెంపులో భాగంగా ఆనకట్ట పొడవునా యాప్రాన్ పనులు చేశారు. ఈ మేరకు రూ.18.50 కోట్లు చెల్లించారు. 2017 చివరలో పనులు నిలిచిపోయాయి. అధికారులు ప్రతి ఏటా ప్రతిపాదనలు పంపుతున్నా, ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. అలాగే మహబూబ్ నహర్, ఫతేనహర్ కెనాల్‌ల లైనింగ్ కోసం 2022లో రూ.50.32 కోట్లు మంజూరయ్యాయి. సుమారు 25 కి.మీ లైనింగ్ కావాలి. మూడేళ్లలో 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఏటా పంటలకు నీరు వదులుతుండటంతో పనులు ముందుకు సాగడం లేదు.



నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం

ఘనపురం ఆనకట్ట ఎత్తు పెంపు కోసం నిధులు అవసరం. భూసేకరణలో భాగంగా రైతులకు పరిహారం చెల్లించేందుకు సుమారు రూ.8 కోట్లు కావాలి. అలాగే ఎఫ్ఎన్, ఎంఎన్ కెనాళ్ల లైనింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఏటా రెండు పంటల కోసం కాలువల ద్వారా నీరు విడుదల చేయాల్సి వస్తున్నందున పనులు ఆగిపోతున్నాయి. పూర్తి కావడంలో జాప్యం జరుగుతోంది.
–శివనాగరాజు, డీఈఈ, ఇరిగేషన్

క్లుప్తంగా

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు బెజ్జంకి విద్యార్థి


క్రీడాకారుడు అరవింద్

బెజ్జంకి(సిద్దిపేట): జాతీయ స్థాయి అండర్ 19 హ్యాండ్ బాల్ పోటీలకు బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన బొనగిరి అరవింద్ ఎంపికైనట్లు హ్యాండ్ బాల్ జిల్లా కార్యదర్శి మల్లేశం కుటుంబ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరవింద్ హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేసి పారామెడికల్ చదువుతున్నాడు. జనవరి 18న కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 19 పోటీల్లో ప్రతిభ కనబరిచిన అరవింద్ జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. నేటి నుంచి బీహార్‌లోని జెహనాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అరవింద్‌ను రాష్ట్ర అడ్వైజర్ కమిటీ సభ్యులు కనుకయ్య, బెజ్జంకిలోని ఆర్‌వీఎంబీపీ అకాడమీ సభ్యులు రవి, మధు, డీవీరావు అభినందించారు.

ఏఐలో విద్యార్థిని ప్రతిభ

- గూగుల్‌లో రీసెర్చ్ పత్రాలు
- అమెజాన్‌లో సైతం పుస్తక రూపంలో స్థానం


తన్వీర్ సుల్తానా

కోహెడ(హుస్నాబాద్): కోహెడ మండల కేంద్రానికి చెందిన ఎండీ తన్వీర్ సుల్తానా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్‌లో ప్రతిభ కనబర్చారు. అమెరికాలోని మిస్సోరి విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సుల్తానా పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈ క్రమంలో కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)లో మిషన్ లెర్నింగ్ ఇన్ కంప్యూటర్ నెట్‌వర్క్ అనే అంశంపై రీసెర్చ్ చేశారు. వాషింగ్టన్‌లో జరిగిన పదవ ఐఈఈఈ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సదస్సులో విద్యార్థిని చేపట్టిన రీసెర్చ్ పత్రాలను పరిశీలించారు. ప్రాముఖ్యత దృష్ట్యా గూగుల్‌లో స్థానం కల్పించినట్లు తెలిపారు. రీసెర్చ్ పత్రాలన్నీ పుస్తక రూపంలో అమెజాన్‌లో సైతం స్థానం పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడి మృతి

పాడె మోసిన మంద కృష్ణ మాదిగ



పాడె మోస్తున్న మంద కృష్ణ మాదిగ

నంగునూరు(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు నంగునూరు మండలం నర్మేటకు చెందిన గందమల్ల యాదగిరి (40) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎస్సీ వర్గీకరణ కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొన్న యాదగిరి జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన మంద కృష్ణ మాదిగ యాదగిరిని మెదక్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మందకృష్ణ మాదిగ యాదగిరి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా నివాళులర్పించి డప్పు కొట్టి పాడె మోస్తూ అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. యాదగిరి పెద్ద కూతురు శ్రీచందన నర్మేట ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతూ ప్రస్తుతం పరీక్షలు రాస్తోంది. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పొలం ఎకరం.. మడిమడికో రకం

పల్లేరులు మొలిచిన చోట పసిడి పంటలు

- బంతి పూలు, స్వీట్‌కార్న్, కూరగాయలు సాగు
- ఏడు పదుల వయస్సులోనూ వ్యవసాయం
- ఆదర్శంగా నిలుస్తున్న తోటపల్లి గ్రామానికి చెందిన మంతెన వెంకటరావు

తోటలోని క్యాబేజీని చూపిస్తున్న వెంకటరావు


హుస్నాబాద్‌రూరల్: పల్లేరులు మొలిచే దుబ్బ నేల కరువు నీళ్లకు ఏం ఎవుసం చేసినా ఏ పంటలు పడుతాయి, రూ.లక్షలు పెట్టి బోరువేసినా కొద్దిపాటి నీరే వచ్చె. ఏ పంట వేసినా చేతికి వచ్చే వరకు బోరు నీరు పోస్తదా..? అనే సందేహం ఆ ఏడు పదుల రైతును ఆలోచింపజేసింది. బాటన పోయేవారు ఏలెత్తి చూపి గీ.. నీళ్లకు ఏం ఎవుసం చేత్తవ్ అనే వాల్లె తప్ప ప్రోత్సహించే వారు లేరు. రైతుకు తన మదిలో మెదిలే ఆలోచనలను ఒక్కొక్కటి అమలు చేసి ఎకరం భూమిలో 20 రకాల పంటలను సాగు చేసి పల్లేరులు మొలసిన చోటనే పసిడి పంటలు పండించి వ్యవసాయంలో ఆదర్శంగా నిలుస్తున్నాడు ఏడు పదుల రైతు వెంకటరావు..

హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన మంతెన వెంకటరావు డిగ్రీ పూర్తి చేసినా ఉద్యోగం రాకపోవడంతో వ్యాపారంలోకి దిగాడు. హుస్నాబాద్ పట్టణంలో స్థిరపడ్డ వెంకటరావు వ్యవసాయ అవసరాలైన పైపులు, మోటార్ల వ్యాపారం మొదలు పెట్టాడు. ఊరిలో అమ్మానాన్న ఇచ్చిన వ్యవసాయ భూమి వైపు కన్నెతి చూడలేదు. పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో ఒక బిడ్డ హైదరాబాద్‌లో వైద్యురాలిగా సేవలందిస్తుంది. వృద్ధాప్యం రావడంతో వ్యాపారం బంద్ చేసి దుకాణంను వేరొకరికి లీజుకు ఇచ్చాడు.

రూ.1.50 లక్షలతో బోరు

పుట్టిన ఊరిలో అమ్మానాన్న ఇచ్చిన ఎకరం వ్యవసాయ భూమిలో ఏదైనా సాగు చేయాలనే ఆలోచన తట్టగానే రూ.1.50 లక్షలతో బోరు వేయించాడు. బోరు నుంచి వచ్చే కొద్దిపాటి నీటితో పంటలు పండించడం కష్టమే అయినా స్వల్పకాలిక పంటలు సాగు చేయాలని నిర్ణయించాడు. వేరుశనగ, బంతి పూలు, మిరప, స్వీట్ కార్న్, బెండ, సోర, వంకాయ, క్యాబేజీ, బీర, కోతి మీర, చిక్కుడు, టమాట కూరగాయలు సాగు చేస్తున్నాడు. స్వల్పకాలిక పంటలు కావడంతో కష్టానికి ఫలితం వస్తుందని రైతు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాడు. పల్లేరులు మొలిచిన చోటనే రైతు ఆలోచనతో పసిడి పంటలు తీసి పల్లె రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

మిరప తోటలో రైతు


నీరు చూసి పంటలు వేయాలి

బోరు వేసినప్పుడు కొద్దిపాటి నీరే వచ్చింది. ఈ నీళ్లతో ఏ పంటలు పండుతాయని అందరూ అన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం వల్ల తక్కువ కాలంలో లాభాలను పొందవచ్చని ఆలోచన వచ్చింది. స్వీట్‌కార్న్, వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయలు, మిరప వీటికి మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. మూడు గుంటల బంతి పూలు పెడితే రూ.20 వేలు వచ్చినయ్, మిర్చి మూడు నెలల నుంచి కాస్తనే ఉంది. సాగుకు పని చేయదు అన్న భూమిలోనే రకరకాల పంటలు వేస్తున్నాను. మన చేళ్లలో పండిన కాయలు, పంటలు మన ఇంట్లో అవసరాలకు ఉపయోగపడుతున్నాయి.

– మంతెన వెంకటరావు, కిషన్‌నగర్


రైతు సాగు చేసిన కూరగాయలు, స్వీట్‌కార్న్ పంటలు

‘నవోదయ’ ఫలితాలు విడుదల

- ఆరో తరగతిలో ప్రవేశాలు
- తొమ్మిదో తరగతి ఖాళీ సీట్ల భర్తీ ఫలితాలు కూడా..
- వివరాలు వెల్లడించిన ప్రిన్సిపాల్ రాజేందర్


వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): 2025–26 విద్యాసంవత్సరం ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయ విద్యాలయం ఆరో తరగతిలో ప్రవేశం కోసం జనవరి 18న నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయని వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఫలితాల వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. ప్రవేశ పరీక్ష ద్వారా అర్హత పొందిన అభ్యర్థులకు సమాచారం చేర వేశామని, హాల్ టికెట్ నంబర్, డేట్ ఆఫ్ బర్త్ వివరాలను నవోదయ విద్యాలయ సమితికి చెందిన హెచ్‌టీటీపీఎస్://సీబీఎస్ఈఐటీ.ఇన్/సీబీఎస్ఈ/2025/ఎన్‌వీఎస్–ఆర్ఈఎస్‌యూఎల్‌టీ/రిజల్ట్.ఏఎస్‌పీఎక్స్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి ఫలితాలు చూసుకోవచ్చన్నారు. అర్హత పొందిన 80 మంది అభ్యర్థులకు ఫోన్ ద్వారా, పోస్టు ద్వారా సమాచారం చేర వేస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచారం కోసం 94489 01318 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

తొమ్మిదో తరగతి ఫలితాలు

నవోదయలో తొమ్మిదో తరగతి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఫిబ్రవరి 8న నిర్వహించిన ఎంట్రెన్స్ పరీక్ష (లేటరల్ ఎంట్రీ) ఫలితాలు మంగళవారం విడుదలైనట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. హాల్‌టికెట్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్ వివరాలు నమోదు చేసి ఫలితాలను నవోదయ విద్యాలయ సమితికి చెందిన హెచ్‌టీటీపీఎస్://సీబీఎస్ఈఐటీ.ఇన్/సీబీఎస్ఈ/2025/ఎన్‌వీఎస్–ఆర్ఈఎస్‌యూఎల్‌టీ/ఆర్ఈఎస్‌సీఎల్ఎస్ఐఎక్స్.ఏఎస్‌పీఎక్స్ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు.

వందేళ్ల చరిత్ర గల పార్టీ సీపీఐ

- జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే వెంకట్‌రెడ్డి
- చేర్యాలలో శతవసంత ర్యాలీ, బహిరంగ సభ


మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అని, పార్టీ నిర్మాణానికి కార్యకర్తలు సన్నద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. పార్టీ శతవసంత వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణ కేంద్రంలోని గాంధీ చౌరస్తా నుంచి అంగడిబజార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాదీ ఖానాలో జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం అణగారిన వర్గాల ఆశయాల సాధనకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటాలు చేసిందన్నారు. 100 ఏళ్ల పోరాటాలు, త్యాగాలు వంటి గొప్ప చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. అనంతరం రాష్ట్ర నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, జనగామ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు దయానంద రెడ్డి, సత్యనారాయణ, వనేష్, లక్ష్మణ్, శంకర్, జనార్దన్, భూమయ్య, బాలుమోహన్, పద్మ, నరేశ్, రజిని, మమత, మహేందర్, కృష్ణ, భాస్కర్‌రెడ్డి, సుదర్శన్, ప్రేమ్, బాల్‌రెడ్డి, భాస్కర్, బన్సిలాల్, సత్తయ్య, నర్సింహచారి, అశోక్, కనకయ్య, శ్రీకాంత్, సురేందర్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

బడులు పరిపూర్ణ వికాస కేంద్రాలు

- డీఈవో రాధాకిషన్ రావు
- పొడిచన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు


విద్యార్థుల నృత్య ప్రదర్శన

పాపన్నపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలు పరిపూర్ణ వికాస కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ రావు అన్నారు. మంగళవారం సాయంత్రం పొడిచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన వార్షికోత్సవానికి అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్న కుమార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒత్తిడి లేకుండా, ఆట పాటలతో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అన్నారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. ఈ రోజు ఉన్నత పదవుల్లో ఉన్నవారంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని గుర్తు చేశారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే దేశభక్తి, విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. వార్షికోత్సవ వేడుకలు చూస్తుంటే, తమ చిన్ననాటి రోజులు గుర్తుకొస్తున్నాయని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రతాప్ రెడ్డి, నీలకంఠం, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, సుదర్శణమూర్తి, నవీన్, రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పాల్గొన్నారు.

దొంగల బీభత్సం

- రెండు వేర్వేరు ఇళ్లలో చోరీ
- బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

సిద్దిపేటకమాన్: రెండు వేర్వేరు తాళం వేసిన ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. గజ్వేల్ ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన అన్నాదమ్ముళ్లు గొడుగు భూపాల్, దేవరాజు కుటుంబాలు తొమ్మిదేళ్ల కిందట వలసొచ్చి పట్టణంలోని శంకర్‌నగర్‌లో ఉమ్మడి కుటుంబంగా నివాసం ఉంటున్నారు. 13న తల్లి సుగుణ మృతిచెందడంతో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి వెళ్లారు. తిరిగి మంగళవారం ఇంటికొచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా రెండు బీరువాల్లో దాచిన 17.5 గ్రాముల బంగారం, 1120 గ్రాముల వెండి వస్తువులు, రూ.20వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఘటనపై బాధితుడు భూపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇంటి తాళం పగులగొట్టి

మరో ఘటనలో పట్టణంలోని శంకర్‌నగర్‌లో తలారీ సాయికుమార్ తల్లి లక్ష్మీతో కలిసి నివాసం ఉంటున్నారు. 22న లక్ష్మీ ఉద్యోగ నిమిత్తం గట్లమల్యాల పీహెచ్‌సీకి విధులకు వెళ్లింది. సాయికుమార్ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి ఊరెళ్లారు. తిరిగి సోమవారం సాయంత్రం ఇంటికొచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా గళ్లపెట్టె పగులగొట్టి రూ.15 వేల నగదు, 2.5 గ్రాముల బంగారు చెవి కమ్మలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఘటనపై సాయికుమార్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో హుండీ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్‌లోని ఎల్లమ్మ ఆలయంలో సోమవారం రాత్రి దుండగులు హుండీ సొమ్ము చోరీ చేశారు. ఆలయానికి వేసిన తాళాన్ని ఇనుప బ్లేడ్‌తో కోసి హుండీని ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ అధ్యక్షుడు కత్తి రవి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

మల్లన్న ఆలయంలో వేలం పాటలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మలికార్జున స్వామి ఆలయంలో ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం షాపింగ్ కాంప్లెక్స్ నందు గల షాపులకు సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా 14 షాపులకు ఒక్కోదానికి ఏడాదికి రూ.87,600, 6 షాపులు ఏడాదికి రూ. 1,23,600 చొప్పున పలువురు పాటపాడి దక్కించుకున్నారు. టెండర్ కోసం 23 వరకు జారీ చేయాల్సి ఉండగా ఆలయ అధికారులు 24న కూడా జారీ చేయడంతో టెండర్ సమయంలో ఆలయ ఈఓతో టెండర్ దారులు వాగ్వాదానికి దిగారు. దీనిపై ఆలయ ఈవో రామాంజనేయులు ను వివరణ కోరగా నిబంధనల ప్రకారమే టెండర్ నిర్వహించినట్లు తెలిపారు.

ఆదాయం రూ.76.13లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి వారానికి సంబంధించిన ఆదాయం రూ.76,13,190 వచ్చినట్లు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. మొత్తం మూడు రోజులలో వివిధ రకాల మొక్కుబడులు, దర్శనాలు, ప్రసాదం, పట్నాలు, బోనాలు, టికెట్ల అమ్మకాల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

సంగారెడ్డి క్రైమ్: దొంగతనం కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం సాయంత్రం పాత బస్టాండ్ శివార్‌లోని ఓ ఫంక్షన్ హాల్ బయట వృద్ధురాలు ఆటో కోసం నిల్చోగ ఇద్దరు వ్యక్తులు బంగారు ఆభరణాలు చోరీకి యత్నించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆటో నంబర్ ఆధారంగా నిందితులను గుర్తుంచారు. పట్టణానికి చెందిన లాల్‌బహదూర్ నగర్‌కు చెందిన షేక్ జావీద్, మహ్మమద్ యాదుల్‌ని మంగళవారం అరెస్ట్ చేసి విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వీరి నుంచి దొంగతనానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నాం. నిందితులని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేశ్ తెలిపారు.

పీపీఈ కిట్లు ధరించి పనులు చేయాలి


పొలంపల్లి గ్రామాన్ని సందర్శించిన సింజెంటా గ్లోబల్ టీమ్ సభ్యులు

పొలంపల్లి గ్రామ రైతులతో సింజెంటా ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): పొలం పనులు చేసే సమయాల్లో కొన్ని సందర్భాల్లో పీపీఈ కిట్లు ధరించాలని సింజెంటా సీడ్స్ మేనేజర్ సత్తిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పొలంపల్లి గ్రామాన్ని సింజెంటా గ్లోబల్ టీమ్ సభ్యులు సందర్శించి రైతులకు సూచనలు చేసారు. మేనేజర్ మాట్లాడుతూ.. రైతులు సస్యరక్షణ చర్యల సమయంలో భద్రత కోసం ప్రత్యేక కిట్లు ధరించాలని తెలిపారు. అనంతరం సింజెంటా టీమ్ సభ్యులు రైతులతో మాట్లాడి వ్యవసాయం గ్రామంలో జరుగుతున్న వ్యవసాయం గురించి అడిగి తెలుసుకున్నారు. తమ వంతు సాయంగా గ్రామంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని సింజెంటా ప్రతినిధులు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ రైతులు సింజెంటా ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మహిళ మృతి


సాయివ్వ(ఫైల్)

చేగుంట(తూప్రాన్): రోడ్డు దాటుతున్న మహిళను బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన స్టేషన్ మాసాయిపేటలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం కొట్టాల గ్రామానికి చెందిన బోదాసు సాయవ్వ(43) కామారెడ్డి నుంచి రైలులో స్టేషన్ మాసాయిపేటకు చేరుకుంది. రైలు దిగి తూప్రాన్ వెళ్లడానికి జాతీయ రహదారిపైకి వచ్చి రోడ్డు దాటుతుండగా చేగుంట వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి అన్న సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి హామీ కూలీ


చాంద్ బీ(ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధి హామీ కూలీ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ చాంద్ బీ(55) మంగళవారం ఉదయం కూలీ పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా ఆకస్మాతుగా కింద పడిపోయింది. అక్కడికక్కడే మృతి చెందడంతో విషయాన్ని తోటి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎంపీడీఓ సుధాకర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి

చేర్యాల(సిద్దిపేట): ప్రమాదవశాత్తు బావిలో పడి గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. మండల పరిధిలోని ముస్త్యాల గ్రామానికి చెందిన చిగురు రాజయ్య(68) ఈనెల 18న వ్యవసాయ బావిలో మోటారు బయటకు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

పేకాట స్థావరంపై దాడి

సిద్దిపేటకమాన్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువరిపై కేసు నమోదు చేసిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో దాడి చేసి రూ.1,500 స్వాధీనం చేసుకొని, అక్రమంగా పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో పది మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.13,500 జరిమానా, వారిలో ఒక్కరికి మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

రెండవ పంటలో యాజమాన్య పద్ధతులు

- మెలకువలతో అధిక దిగుబడులు
- చెరకు చెత్తతో పంటకు లాభం
- జహీరాబాద్ డివిజన్ ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్ టౌన్: మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల చెరకు రెండవ పంట నుంచి అధిక దిగుబడులు సాధించవచ్చు. మోడెం తోటల విషయంలో రైతులు శ్రద్ధ చూపకపోవడం మూలంగా దిగుబడులు పడి పోతున్నాయి. రెండో పంటలో రైతులకు పెట్టుబడి ఖర్చు తక్కువ. యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా ఫస్ట్ క్రాప్ కంటే రెండో పంటలో అధిక దిగుబడులను సాధించని వ్యవసాయ శాఖ జహీరాబాద్ డివిజన్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. నాణ్యమైన దిగుబడులు పొందాలంటే సమయానుకూలంగా మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆయన సూచించారు.

జహీరాబాద్ ప్రాంత నేలలు చెరకు పంట సాగుకు అనుకూలం. సుమారు 10 వేల మంది రైతులు దాదాపు 20 వేల ఎకరాల్లో ప్రతీ సంవత్సరం సాగు చేస్తుంటారు. జహీరాబాద్‌తోపాటు జిల్లాలోని సంగారెడ్డి, నారాయణఖేడ్ తదితర నియోజకవర్గాల్లో కూడా రైతులు చెరకు సాగు చేస్తున్నారు. ఫస్ట్ క్రాప్ (మొక్కతోటలు) నరికిన తర్వాత రెండో పంటను మోడం అంటారు. ప్రస్తుతం చెరకు సీజన్ ముగియడంతో రైతులు రెండో పంట సాగుపై దృష్టి పెట్టారు.



యాజమాన్య పద్ధతులు

- చెరకు పంటను నరికిన వెంటనే మోడులను భూమికి సమాంతరంగా నరికి వేయాలి. పిలకలు భూమి లోపల నుంచి వచ్చి బలీయంగా ఎదిగి వస్తాయి. అధికంగా పిలకలు వచ్చి పంట దిగుబడులు పెరిగేందుకు దోహదపడుతుంది.
- చెత్తను కాల్చి వేయకుండా ఆకులు కుళ్లినట్లు చేస్తే సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఇలా చేయడం ద్వారా ఎకరానికి 3 నుంచి 4 టన్నుల మేర సేంద్రియ ఎరువు ఉత్పత్తి అవుతుంది.


జహీరాబాద్‌లో సాగవుతున్న చెరకు పంట

- తోట నరికిన వెంటనే నీటి తడులు ఇచ్చిన తర్వాత అదును చూసుకొని బొదెను నాగిలితో రెండు పక్కల దున్నాలి. ఇలా దున్నిన సాళ్లలో యూరియా రెండు బస్తాలు, ఎస్ఎస్‌పీ నాలుగు బస్తాలు, ఎంఓపీ ఒక బస్తా వంతున కలిపి వేయాలి. తర్వాత పక్కన నాగలితో దున్నినట్లయితే ఎరువు పూర్తిగా కప్పబడి చెరకు పంట ఏపుగా పెరుగుతుంది.
- బోదెను చీల్చడం ద్వార పాత వేరు తెగి కొత్త వేర్లు అభివృద్ధి చెందుతాయి. ఈ కొత్త వేర్లు చురుకుగా ఉండి భూమిలోని పోషకాలను, నీటిని, గాలిని గ్రహించి వాటికి శక్తి పెరుగుతుంది.
- తోటలో దున్నడం ద్వారా వేర్లకు కావాల్సిన గాలి అంది మొక్క వృద్ధి చెందడంతోపాటు పిలకలు అధికంగా వచ్చే అవకాశముంది.
- మోడెంలో మొక్కలకు మొక్కలకు మధ్య రెండు నుంచి మూడు అడుగుల ఖాళీలు ఉన్నట్లయితే నింపడం వల్ల పంట నాణ్యత పెరుగుతుంది.
- మోడెం తోటలలో రైతులు బోదెలను దున్నిన వెంటనే మట్టిని మోదులపైకి ఎగ దోస్తున్నారు. దీని వల్ల పిలకల శాతం గణనీయంగా తగ్గి పంట దిగుబడులు పడి పోయే ప్రమాదముంది. మోడులపైకి రెండు నెలల వరకు మట్టిని ఎగతీయకుండా చూడాలి. రెండో పంటలో ఫస్ట్ క్రాప్ తోట కంటే ఒకటిన్నర శాతం ఎక్కువ నత్రజని వాడాలి. ఇలా యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి పెరుగుతుందని ఏడీఏ వివరించారు.